ఉత్సాహంగా పరుగు పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆటల పోటీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం చిన్నారులకు రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 25 మంది చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత మాట్లాడుతూ చిన్నారులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పరుగు పెడుతున్న చిన్నారులు

వైసిపి కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించడంపై హైకోర్టు స్టే

గిరిజన హక్కులు, చట్టాలు అమలు చేయాలి
- గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: పాడేరులో వైసిపి భూ కబ్జాకు హైకోర్టు స్టే ఇచ్చి బ్రేక్ వేసింది. అల్లూరి జిల్లా కేంద్రంలో చింతలవీధి పంచాయతీ నడింవీధి గ్రామంలో గిరిజన రైతుల సాగు బడిలో ఉన్న రెండు ఎకరాల స్థలాన్ని వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం లీజు పద్ధతి పై భూమి పొంది నిర్మాణ పనులు చేపట్టింది. దీన్ని సవాల్ చేస్తూ నిర్మాణ పనులను అడ్డుకుంటూ ఆ గ్రామ గిరిజనులతో కలిసి ప్రత్యక్ష పోరాటం చేపట్టిన ఏపీ గిరిజన సంఘం వైసిపి పార్టీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయింపు చట్ట విరుద్ధమని పోరాటం కొనసాగించింది. వైసిపి ప్రభుత్వం గిరిజన రైతు మజ్జి పోల్లన్న కుటుంబం గత 75 సంత్సర కాలంగా సాగు చేస్తున్న భూమి లో వైసిపి ఆఫీస్ నిర్మాణం కోసం 2 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాడేరు మండలం చింతలవీధి పంచాయితీ నడింవీది గ్రామంలో మజ్జి పోల్లన్న సాగు చేస్తున్న భూమి సర్వే నెం. 151 లో 2 ఎకరాల భూమిలో వైసిపి పార్టీ ఆఫీస్ నిర్మాణానికి స్థలంను జిల్లా కలెక్టర్ కేటాయించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల మధ్య మాత్రమే భూ బదిలీలు నిర్వహించాలని 1/70 చట్టం పేర్కొన్న వాటిని ధిక్కరించి వైసిపి ఆఫీస్ నిర్మాణానికి స్థలం కేటాయించడం దారుణమని. గిరిజన సంఘం అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన కరువైంది. ఏజెన్సీ ప్రాంతంలో వైసిపి పార్టీ ఆఫీస్ నిర్మాణానికి స్థలంను మొండిగా కేటాయించడంపై రాష్ట్ర

తీర్పు కాపీలను చూపుతున్న నాయకులు

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్:354 పై సవాల్ చేస్తూ గిరిజన సంఘం మరియు భూ బాధిత కుటుంబాలు మే 12 న రిట్ పిటిషన్ దాఖలు చేసింది. నిందితులుగా వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (రెవిన్యూ ల్యాండ్), డైరెక్టర్ గిరిజన సంక్షేమశాఖ, అల్లూరి జిల్లా కలెక్టర్, ప్రాజెక్టు అధికారి, తహశీల్దార్‌లను గిరిజన సంఘం చేర్చింది. వీరందరికి హైకోర్టు నుండి స్టే ఆర్డర్ ప్రతులు చేరనున్నాయి. రాష్ట్ర హైకోర్టు స్పందిస్తూ గిరిజ నేతర పార్టీకి / సంస్థకు భూమి లీజుకు, లేదా ఏ రూపంలోలో హక్కులు దాఖలు చేయరాదని, వైసిపి ఆఫీస్ నిర్మాణం కోసం కేటాయించిన రెండు ఎకరాల భూమి 1/70 చట్ట దిక్కరణ కిందకి వస్తుందనీ, 1997లో సమత వర్సెస్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కేసులో సుప్రీం కోర్టు తీర్పును పొందుపరుస్తూ, తక్షణమే వైసిపి ఆఫీస్ నిర్మాణం పనులు వెంటనే నిలుపుదల చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పనుల్ని తక్షణమే ఆపాలి: అప్పలనర్స

గిరిజన చట్టాల్ని ఉల్లంఘించిన వైసీపీ ప్రభుత్వంపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించిందని తక్షణమే వైసీపీ కార్యాలయ పనులు నిలుపుదల చేయాలని లేదంటే ప్రత్యక్షంగా అడ్డుకుంటామని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనరస హెచ్చరించారు పాడేరు గిరిజన సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం గిరిజన సంఘం జిల్లా నాయకులు సుందర్ రావు భూ భాదిత కుటుంబాల గిరిజనులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార బలంతో అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారులపై ఒత్తిడి కలిగించి, గిరిజనులకు అన్యాయం చేసేందుకు పూనుకున్నారని. తక్షణమే జిల్లా ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకుని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు అమలు చేసి వైసిపి కార్యాలయ నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని, లేకపోతే ప్రత్యక్షంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు ఎల్.సుందరరావు, మజ్జి సత్తిబాబు, మజ్జి నాగరాజు, మజ్జి కొండబాబు, మజ్జి పోలన్న తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న మహిళలు

ఖాళీ బిందెలతో ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని గుంటసీమ పంచాయతీ చర్యవలస గ్రామంలో మరమ్మతు గురైన సోలార్ తాగునీటి పథకాన్ని మరమ్మత్తు చేసి వెంటనే తాగునీటి సౌకర్యం పునరుద్ధరించాలని కోరుతూ ఆ గ్రామస్తులు, గిరిమహిళలు ఖాళీ బిందెలతో గ్రావిటీ పథకం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. వెంటనే మరమ్మతులు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, ఆ గ్రామంలో తాగునీటి సౌకర్యం కోసం గత మూడు సంవత్సరాల క్రితం సోలార్ విద్యుత్ ద్వారా గ్రావిటీ పథకాన్ని రూ 15 లక్షలతో నిర్మించారన్నారు. ప్రస్తుతం మరమత్తు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఆ గ్రామంలో తీవ్రమైన మంచినీటి ఎద్దడి ఏర్పడిందని చెప్పారు. సంబంధిత ఆర్‌బ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. తప్పని పరిస్థితుల్లో ఆ గ్రామానికి సమీపంలోని పొలంలోని బురద నీటిని సేకరించి ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకుడు పీ. తిలక్, కె.రామన్న నాయుడు, జి.డానియల్, పి.హరిశ్చంద్ర, కే.కర్రి బుడ్డి, పి.ప్రమీల, జి ముక్తా, కేలక్ష్మి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

అగ్నికి దగ్ధమవుతున్న తాటాకు ఇళ్లు

నాలుగు తాటాకు ఇళ్లు దగ్ధం

- అగ్నికి ఆహుతైన రూ.4 లక్షల నగదు

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు తాటాకు ఇళ్లు దగ్ధమయ్యాయి. తిమ్మాపురం గ్రామానికి చెందిన బొంకు జాన్ అబ్బాయి ఇంటిలో గ్యాస్ లీక్ ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. జాన్ అబ్బాయి ఇంటి నుండి మంటలు పక్కనున్న కొలిపే ముసలయ్య, వజ్రంగి వీరబాబు, రాజుల కన్నారావు ఇళ్లకు కూడా వ్యాపించాయి. దీంతో నాలుగు ఇళ్లు కాలి బూడిదయ్యాయి. కుటుంబ అవసరాల నిమిత్తం రెండు రోజుల క్రితం బొంకు జాన్ అబ్బాయి రూ.4 లక్షలు తీసుకొచ్చి ఇంట్లో ఉంచగా, ఆ మొత్తం అగ్నికి ఆహుతైనట్లు బాధితుడు కన్నీరు మున్నీరుగా విలపించాడు. కాయకష్టం చేసుకుని దాచుకున్న సొమ్ములు కాలి బూడిదవడంతో లబోదిబోమంటున్నాడు. అలాగే నలుగురి ఇళ్లలో గృహోపకరణాలు, తిండిగింజలు, బట్టలు వంటివి కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న తిమ్మాపురం విఆర్ఓ వెంకయ్య సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సంఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని, నష్టాన్ని ఇంకా అంచనా వేయవలసి ఉందని విఆర్ఓ తెలిపారు.

సచివాలయ సిబ్బంది గైర్హాజరుపై .. కలెక్టర్ మండిపాటు

ప్రజాశక్తి -అనంతగిరి:మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి సచివాలయం సిబ్బంది హాజరు కాక వడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మండిపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై మండలంలో పని చేస్తున్న సచివాలయం సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో బుధవారం అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారికి కలెక్టర్ సమాచారం అందించినప్పటికీ సిబ్బంది సకాలంలో హాజరు కాకపోవడంతో ఆగ్రహ వ్యక్తం చేస్తూ మండిపడ్డారు. ఉదయం 11.30 గంటలకు కలెక్టర్ నేరుగా మండల పరిషత్ కార్యాలయంలో సందర్శించినప్పటికీ ఏ ఒక్క సచివాలయం సిబ్బంది కూడా అప్పటికి కూడా హాజకాలేదు. మధ్యాహ్నం 2. గంటలకు సమావేశం నిర్వహించాలని భావించినా కలెక్టర్ తిరిగి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లినప్పటికీ అప్పటికైనా సిబ్బంది హాజరు కాలేదు. కలెక్టర్ ఆదేశాలకు బేఖతర్ చేస్తూ హాజరు కాకపోవడం పట్ల సిబ్బందిపై ఎటువంటి చర్యలు చేపడతారన్న దానిపై వేసి చూడవలసి ఉంది.

ఆసుపత్రి తనిఖీ

స్థానిక పిహెచ్‌సిని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రి పరిశుభ్రత, రికార్డులను, వైద్య సిబ్బంది పనితీరు, రోగుల కు వైద్య సేవలు అందే తీరును వైద్య అధికారిణి జ్ఞానేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. ముందుగా రోగులు విశ్రాంతి తీసుకునే గది పరిశుభ్రతను, గర్భిణీల గదులను పరిశీలించారు. అప్తాల్మిక్ అసిస్టెంట్ లక్ష్మి విధులకు గైర్హాజరైనందున రెండు నెలలు జీతాలు నిలుపుదల చేయాలని వైద్య అధికారిణిని ఆదేశించారు. సిబ్బందితో కలెక్టర్ మాట్లాడుతూ, గర్భిణీలకు ప్రసవం జరిగేంత వరకు వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.. అనంతరం మూతపడిన హరిత హిల్ రెస్టారెంట్‌ను సందర్శించి భవనాన్ని పరిశీలించారు.

కలెక్టర్ మాట్లాడుతూ, రెస్టారెంట్ మూసివేయడంతో భవనమంత పాడైందని దీనికి సంబంధించిన రికార్డులను ఏపీ టూరిజం శాఖ రెవెన్యూ అధికారులు వారం రోజుల్లోపు తమ కార్యానికి అందజేయాలన్నారు.

కలెక్టర్ కు సిపిఎం వినతులు

కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వివిధ సమస్యలపై వినతులు వెల్ల వెత్తాయి. స్థానిక జెడ్పిటిసి గంగరాజు, సిపిఎం నేతలు అభివృద్ధి పనులపై లిఖితపూర్వకంగా విలవించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి గంగరాజు

ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వినతిపత్రం ఇస్తున్న గంగరాజు

మాట్లాడుతూ, అనంతగిరి పంచాయతీ లక్ష్మీపురం మెయిన్ రోడ్డు నుండి రాజుపాక గ్రామం వరకు, అనంతగిరి పెద్దూరు నుండి పాతకోట. మీదుగా రేగం. నుండి నందిగుమ్మి, లొంగపర్తి పంచాయతీ మెయిన్ రోడ్డు రింగ్ రోడ్డులను నిర్మించాలన్నారు.బొర్రా నుండి కోనపురం మీదుగా అరకు మండలం లోతేరు వరకు బీటీ రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరారు. ఫారెస్ట్ అధికారుల అభ్యంతరలతో నిలిచిన డేకపురం. బొంగిజా, ఒనుకొండ, శంకుపర్తి రోడ్లను తక్షణమే అనుమతులు ఇవ్వాలని కోరారు.

ఎంపీపీ నీలవేణి మాట్లాడుతూ ఆసుపత్రులలో గర్భిణీలకు భోజన సదుపాయం కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్ .నాగులు, జె.సుబ్బారావు, ఉప తహసిల్దార్ వై.పాత్రుడు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది, గిరిజనులు

'పర్యావరణ జీవనశైలి'పై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని దిబ్బలూరు, గానుగుల గ్రామాల్లో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అన్న అంశంపై బుధవారం అటవీశాఖ ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కృష్ణదేవి పేట అటవీశాఖ రేంజ్ సెక్షన్ సిబ్బంది మాట్లాడుతూ భూమిలో తేమ శాతం గురించి దాని సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విఎస్ఎస్ కమిటీల ద్వారా అడవిని సంరక్షించాలని కోరారు. అనంతరం విఎస్ఎస్ కమిటీ చేత ప్రతిజ్ఞ చేయించారు.

రీ సర్వేపై అలసత్వం వహిస్తే చర్యలు

- ఐటిడిఎ పిఒ వి.అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకం భూముల రీ సర్వే చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తే సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ హెచ్చరించారు. బుధవారం ఆయన కార్యాలయంలో అనంతగిరి, అరకు వ్యాలీ, పాడేరు, పెదబయలు, జికె.వీధి, కొయ్యూరు, చింతపల్లి, ముంచంగిపుట్టు మండలాల సర్వే అధికారులతో రీ సర్వే పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వేలో జాప్యం చేయకుండా నిర్దేశించిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలని పేర్కొన్నారు. భూ సర్వే సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత గ్రామ సర్వేయర్లుపైనే ఉందన్నారు. రీ సర్వేను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసారు. సర్వేయర్లు మూడు బృందాలుగా ఏర్పడి వెక్టరైజేషన్, క్షేత్ర స్థాయిలో సర్వే, డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే అధికారులు మండల స్థాయిలో గ్రామ సర్వేయర్లతో సమావేశాలు నిర్వహించి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రోవర్లను ఖాళీగా ఉంచడానికి వీలు లేదన్నారు. 2140 గ్రామాలను సర్వే చేయాల్సి ఉండగా 460 గ్రామాల్లో సర్వే పూర్తి చేసారని చెప్పారు. సర్వే ప్రక్రియ కోసమే ప్రభుత్వం గ్రామ సర్వేయర్లను నియమించిందని ప్రభుత్వ ఆకాంక్షల కనుగుణంగా పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే నాగేశ్వరరావు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ వెంకటరావు, ఏడు మండలాల డిప్యూటీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ

గిరిజన సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సంఘం పాడేరు మండల మహాసభ దోకులూరు పంచాయతీ దుమ్మా పుట్టులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు అధ్యక్ష కార్యదర్శులుగా సోమేలి చిట్టిబాబు, కార్యదర్శిగా కిల్లో సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యక్షులుగా కుర్రబింగు నాయుడు (వణుగు పల్లి), పాలికి భాస్కర్ రావు (మోదపల్లి), మామిడి రాజారావు, వెంకటరమణ (దుమ్మాపుట్టు) సేదరి సత్తిబాబు, మాదా శ్రీను, కుర్ర ప్రసాద్, బొజ్జన్న మజ్జి సతీష్, కొండబాబు, అప్పారావు, నానాజీ, పాంగి కామరాజుతో పాటు 14 మంది మండల కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

చిరుజల్లులతో ఉపశమనం

ప్రజాశక్తి- అనంతగిరి:గత వారం రోజులుగా మండుతున్న ఎండలకు ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజానీకానికి ఒక్కసారిగా ఉపశమనం లభించింది. బుధవారం మధ్యాహ్నం ఆకాశంలో మార్పు చెంది మండలంలోని పలుచోట్ల తేలికపాటి వర్షం కురిసింది. దీంతో చల్లటి వాతావరణం నెలకొల్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. పలు గ్రామాల్లో సమీపంలో ఉన్న గెడ్డలు, చెట్ల కింద రోజంతా సేద తీరుతున్నారు.

అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి - పెదబయలు రూరల్:మండలంలో గంపరాయి సచివాలయం పరిధిలోని క్యారీలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని వైస్ ఎంపీపీ రాజుబాబు కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, గంపరాయి సచివాలయం సెక్రెటరీ ఇచ్చిన ఇచ్చిన రసీదు లో తేదీ, సమయం లేనందున వాహనదారులు ఇష్టానుసారంగా పలుమార్లు ఇసుకను రవాణా చేపడుతున్నారని ఆరోపించారు.స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు అండదండలతో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మన్యంలో... భానుడి భగభగలు

నిర్మానుష్యంగా ఉన్న విఆర్.పురం కూడలి

- 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు
- ఎండవేడి, వడగాలులు ఉక్కపోతతో విలవిలలాడుతున్న జనం
- ఇళ్లకే పరిమితమైన వైనం..

ప్రజాశక్తి-విఆర్.పురం, కొయ్యూరు

మన్యం ప్రాంతం అంటే చల్లగా ఉంటుందని అందరూ భావిస్తారు. అందుకు భిన్నంగా ఏజెన్సీలోనూ భానుడు భగభగ మండిపోతున్నాడు. మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండలకు వడగాలులు, ఉక్కపోత తోడు కావడంతో జనం విలవిలలాడిపోతున్నారు.

జనం లేక నిర్మానుష్యంగా ఉన్న కొయ్యూరు రహదారి

ఉదయం 8 గంటలకే సూర్య ప్రతాపం మొదలవుతోంది. 10 గంటల నుండి ఎండ తీవ్రత పెరుగుతూ మధ్యాహ్నం సమయానికి భానుడు నిప్పులు కక్కుతున్నాడు. సాయంత్రం 4 గంటలైనా ఎండ తీవ్రత తగ్గడం లేదు. సాయంత్రం ఐదారు గంటల వరకు వడగాల్పుల ప్రభావం ఉంటోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండు వేసవిలోనూ చల్లని వాతావరణంతో ఆకట్టుకునే విఆర్.పురం మండలంలో ఇటీవల కాలంలో అత్యధికంగా 41 నుంచి 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం విఆర్.పురం, కొయ్యూరు ప్రాంతాల్లో 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండవేడి, వడగాలులను తట్టుకోలేక ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు.

గత వారంలో ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం వరకు ఎండ మండించినా సాయంత్రానికి వర్షం కురవడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందేవారు. అయితే గత రెండు మూడు రోజులుగా వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకొని వర్షాలు కురవడం లేదు. మరో వైపు ఎండలు తారెత్తిస్తున్నాయి. క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మన్యంలో ఉండే పచ్చదనం అక్రమార్కుల గొడ్డలి వేటుకు కానరాకుండా పోతుండడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎండల తీవ్రత ఇంకా ఎక్కువగానే ఉంటుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

వేసవి కాలంలో బయటకు వెళ్లాలంటే తగిన జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఎవరైనా బయటకు వెళ్లాలంటే తలకు తప్పనిసరిగా వస్త్రం కట్టుకోవాలి. తమ వెంట వాటర్ బాటిల్ తీసుకెళ్లాలి. పిల్లలు, వృద్ధుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని పనులు సాధ్యమైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పెట్టుకోవాలి. ముఖ్యంగా ఎండ కాలంలో నీటిని అధికంగా తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఫ్రూట్ జ్యూస్‌తో పాటు నిమ్మరసాలు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తీసుకుంటే ఎండల నుంచి ఉపశమనం పొందవచ్చని వివరిస్తున్నారు.

గతంలో కొయ్యూరు మండల కేంద్రంలో రెండు నుంచి ఐదు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. అయితే ఈ సంవత్సరం ఎక్కడా చలివేంద్రం కానరాకపోవడంతో మండలంలో నడిచి వెళ్లే పాదచారులు మంచినీళ్ల కోసం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మండల కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. మండల కేంద్రాల్లో మజ్జిగ, మంచినీళ్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం విఆర్.పురం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు అధికారులను డిమాండ్ చేశారు.

5 పంచాయతీలను తెలంగాణలో కలపండి

ఆ రాష్ట్ర గవర్నర్ తమిళ సైకు వినతి

ప్రజాశక్తి-ఎటపాక

భద్రాచలం పట్టణానికి ఆనుకొని ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణ రాష్ట్రంలో విలీనం చేయాలని ఆయా పంచాయతీ ప్రజలు తెలంగాణ గవర్నర్ తమిళసైకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పలు కార్యక్రమాల నిమిత్తం భద్రాచలం వచ్చిన తెలంగాణ గవర్నర్ కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం పంచాయతీ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 5 పంచాయతీల ప్రజలతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు తమ సమస్యలను వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం మండలంలో ఉన్న ఐదు పంచాయతీలను పోలవరం ముంపు ప్రాంతమని ఆంధ్రాలో కలిపారని తెలిపారు. కాని ఐదు పంచాయతీలు పోలవరం ముంపులో లేవని ఏపీ ప్రభుత్వం తేల్చి చెప్పిందని, అందువల్ల తమకు పోలవరం పరిహారం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. 400 కిలోమీటర్ల దూరంలో జిల్లా కేంద్రం, 80 కిలోమీటర్ల దూరంలో ఐటీడీఏ కేంద్రం ఉన్నాయని తెలిపారు. అదే తెలంగాణలో కలిపితే 45కిలోమీటర్ల దూరంలో జిల్లా కేంద్రం, 10 కిలోమీటర్ల దూరంలో అన్ని వైద్య సౌకర్యాలు, పీజీ వరకు విద్య అందుబాటులో ఉంటాయని వివరించారు. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్నందున రవాణాకు కూడా ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన తెలంగాణ గవర్నర్ మాట్లాడుతూ 5 పంచాయతీల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జంగిలి సంపత్, నక్కా వెంకన్న, బేతి పాపారావు, బండారు వీర భద్రం, గొల్లపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులతో ముఖాముఖిలో పాల్గొన్న తెలంగాణ గవర్నర్ తమిళ సై

జూలో జిరాఫీ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాలలో దాదాపు పదేళ్ల వయసు గల మే అనే పేరుగల ఆడ జిరాఫీ బుధవారం ఉదయం మృతి చెందింది. మూడు నెలలుగా క్రానిక్ మెట్రిటిస్, న్యూమోనియా వ్యాధితో బాధపడుతున్న జిరాఫీకి జూ వైద్యులు చికిత్స అందించినట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. రెండు మూడు వారాలుగా జిరాఫీ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ వచ్చిందన్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఆమె తెలిపారు. 2013లో నాలుగు నెలల జిరాఫీని మలేషియాలోని నెగెరా జూ పార్కు నుంచి ఇక్కడకు తీసుకొచ్చినట్లు వివరించారు. వైజాగ్ జూ పార్కుకు జిరాఫీలు, జిబ్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి.

అప్పన్న సన్నిధిలో ఐఎఎస్ అధికారి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను బుధవారం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురపు కనకరాజు సాదరంగా స్వాగతం పలికారు. ఆయన ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఉపాధ్యాయులకు జిల్లా ఉప విద్యా శాఖాధికారి గౌరీశంకర్ సూచించారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటుచేసిన వృత్యంతర శిక్షణలో భాగంగా బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారని, త్వరలో ప్రతి తరగతి గదిలో ఇన్స్ట్రాక్టివ్ పానల్స్ అందజేయనున్నట్లు వివరించారు. స్థానిక ప్రభుత్వ డైట్ అధ్యాపకులు త్రినాథరావు మాట్లాడుతూ, 'విద్యార్థులను భావి భారత పౌరులుగా ఎలా తీర్చిదిద్దాలి' అనే అంశంపై వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ టిఎస్‌వి ప్రసాదరావు, బలరామమూర్తి, మధుమతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి వద్దు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, చదువు పరంగా విద్యార్థులపై ఏ విధమైన ఒత్తిడి తేవొద్దని ఎపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.ఉషారాణితో కలిసి ఆయన స్థానికంగా ఉన్న తిరుమల, శశి విద్యా సంస్థలను బుధవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. తరగతి గదులు, వసతి సదుపాయం, వంట గదులు తదితరాలను పరిశీలించారు. ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలని, ఫీజులపై తల్లిదండ్రులతో మాత్రమే చర్చించాలని స్పష్టం చేశారు. మానసిక నిపుణులను తప్పని సరిగా నియమించాలన్నారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహించరాదని, సిసి కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని, ఫీజులు, సెలవులు, పరీక్షల విషయాల్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్కడే ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు పలు వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యా సంస్థల ప్రతినిధులు మూర్తి, సత్యనారాయణ, మృత్యుంజయరావు, శశి విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎం.క్రాంతిసుధ, ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టెలీ కమ్యూనికేషన్ రంగం కీలకం

ప్రజాశక్తి -తగరపువలస : దైనందిన జీవితంలో టెలీ కమ్యూనికేషన్ రంగం కీలకమని టెలీ కమ్యూనికేషన్ రంగ నిపుణులు ఎ.శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం టెలీ కమ్యునికేషన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడుతూ, టెలీ కమ్యూనికేషన్ రంగంలో జరిగే పురోగతిని వివరించారు. ఇండియన్ స్టూడెంట్స్ ఫోరం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీర్స్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్ఇసి ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాసులు, ఐఇటిఇ కార్యదర్శి వినయ్, ఐఎస్ఎఫ్ కౌన్సెలర్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడారు.

తిరుగు ప్రయాణం.. కష్టతరం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మూడు రోజులు మోదకొండ ఉత్సవాలు ముగియడంతో ఉత్సవాలకు విచ్చేసిన వారంతా బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో, పాడేరులో నాలుగు రోజు సైతం సందడి వాతావరణం నెలకొంది. మోదకొండ ఉత్సవాల సందర్భంగా ఇతర ప్రాంతాలకు చెందిన వారంతా పాడేరు చేరుకుని తమ బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఉన్నారు. ఆది, సోమ , మంగళవారాలు ఉత్సవాలను చూసుకుని బుధవారం గమ్యస్థానాలకు ప్రయాణమవడంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. జనం తమ తమ వాహనాల్లో, ఆటోల్లో, జీపుల్లో ఇలా ఏదో విధంగా గమ్యస్థానాలకు వెళుతున్న దశ్యాలను ప్రజాశక్తి కెమెరాలో బంధించింది.

ప్రయాణికులతో రద్దీగా పాడేరు ఆర్‌టిసి బస్ స్టాండ్

పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలకు వచ్చిన భక్తులకు తిరుగు ప్రయాణం ఎంతో కష్టతరమైంది. ఉత్సవాలకు వచ్చిన భక్తులు గమ్యానికి చేరుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు పాడేరులో మోదకొండమ్మ ఉత్సవాలు జరిగింది. ఆర్‌టిసి బస్సులు చాలినన్ని లేక పోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ముఖ్యంగా మైదాన ప్రాంతానికి వెళ్లే బస్సులు కొరత ఉండడంతో వందలాదిమంది ప్రయాణికులు ఎదురు చూడాల్సి వచ్చింది. బస్సులో సీటు దక్కించుకునేందుకు ప్రయాణికులు పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. అరకు లోయ, జోలపుట్టు, చింతపల్లి వైపునకు వెళ్లే బస్సులు ప్రయాణికులతో రద్దీగా మారాయి.

గిరిజనుల సమస్యలపై పోరాటం

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

మాట్లాడుతున్న సురేంద్ర

ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న కృష్ణారావు

ప్రజాశక్తి -హుకుంపేట: గిరిజన సంఘం మండల 8వ మహా సభను గడికించుమండ పంచాయితీ గడ్డిమర్రి గ్రామంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పర్యవేక్షణలో మహా సభ నిర్వహించారు. ఈ మహాసభలో గత ఉద్యమ కార్యక్రమాలను సమీక్షించారు.అనంతరం సభ నుద్దేశించి రాష్ట్ర గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో 1/70 భు బదలాయింపు చట్టం ఉల్లంఘనలు, గిరిజనేతరుల అక్రమ శాశ్వత నిర్మాణాలు నిలుపుదల చేయాలన్నారు. జీవో 3 పునరుద్ధరణ, బోయ/,వాల్మీకి లను ఎస్టీ జాబితాలో చేరుస్తూ జగన్ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానానికి వ్యతిరేక ఉద్యమం, నూతన అటవీ పాలసీ, నూతన విద్యా విధానం, ఎస్సి,ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల దారి మళ్లింపు తదితరులు అంశాలపై తీర్మానించి, వీటిపై పోరాటం చేయాలన్నారు. గ్రామాలకు రహదారి, తాగు, సాగునీరు సౌకర్యాల కల్పనపై లక్ష్మణ్‌రావు, అప్పల కొండ పడాల్‌లు ప్రవేశ పెట్టిన తీర్మాణాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

నూతన కమిటీ ఎన్నిక

గిరిజన సంఘం హుకుంపేట మండల అధ్యక్ష, కార్యదర్సులుగా సోమన్న, కృష్ణారావు ఎన్నిక అయ్యారు. ఈ కార్యక్రమంలో సీదరి బుద్రన్న, సుందర్, కొర్ర బొంజుబాబు, సోములు, కొర్ర నూకరాజు, మహిళలు మిత్రో, కొండమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో బుధవారం వాకపాడు గ్రామం నుండి రాయ వరానికి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తహసిల్దారు శ్యాం కుమార్ సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. అంతరం ఆయన మాట్లాడుతూ అనుమతి లేనిదే ఎవరైనా గ్రావెల్ మట్టి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సారా స్వాధీనం

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం పి.పొన్నవోలు శివారు ఆర్.కొత్తూరు గ్రామ సమీపంలో తరలించేందుకు సిద్ధం చేసిన సుమారు 60 లీటర్ల నాటు సారాతో పాటు బైకును బుధవారం స్వాధీనం చేసుకున్నట్టు కొత్తకోట ఎస్సై విభూషణరావు తెలిపారు. 60 లీటర్ల సారాను పల్సర్ బైక్ పై తరలిస్తుండగా పట్టుకునేందుకు ప్రయత్నించగా గుర్తు తెలియని వ్యక్తి పరారీ కాగా రెండు ప్లాస్టిక్ కేనాలతో సారా తో పాటు బైక్ ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి -యంత్రాంగం

గోపాలపట్నం : విశాఖ పర్యటనలో భాగంగా విశాఖ వచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు గోపాలపట్నంలో భారీ ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తనపై చూపించిన ఆదరాభిమానాలు గణబాబుపై చూపించి అఖండ విజయాన్ని సమకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్, నాయకులు పొలిమేర సీతారాం, నందవరపు సోములు, నరవ పైడిరాజు, బంగారు తులసీరామ్, ఎలమంచిలి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి బహిరంగ సభకు బైకు ర్యాలీ

ఆరిలోవ : పెందుర్తిలో బహిరంగ సభకు టిడిపి అధినేత చంద్రబాబు వచ్చిన నేపథ్యంలో 9, 10, 11, 12, 13 వార్డుల పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం సాయంత్రం బైకు ర్యాలీగా తరలి వెళ్లారు. ఆరిలోవ తోటగరువు నుంచి బాలాజీనగర్ మీదుగా బిఆర్‌టిఎస్ రోడ్డు ముడసర్లోవ రోడ్డు మీదుగా బైకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, మద్దిల రాజశేఖర్, బుడుమూరు గోవిందు, ఒమ్మి పోలారావు, ముగడ రాజారావు, గాడి సత్యం, రాగతి అచ్చుతరావు, ఏడువాక సన్యాసిరావు, తురకపూడి బాలస్వామి పాల్గొన్నారు.

తరలిన 98వ వార్డు టిడిపి నాయకులు

సింహాచలం: చంద్రబాబును కలిసేందుకు 98వ వార్డు టిడిపి కార్పొరేటర్ పివి.నరసింహ ఆధ్వర్యాన నాయకులు భారీగా తరలివెళ్లారు.

స్టీల్‌ప్లాంట్ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలను మెరుగుపర్చాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని హాస్పిటల్ సిపిఎం కెహెచ్.ప్రకాష్‌ను స్టీల్ ఇంటక్ నాయకులు కోరారు. ఆసుపత్రి సిజిఎం, వైద్య బృందంతో ఇంటక్ నాయకులు బుధవారం హాస్పిటల్‌లో సమావేశమయ్యారు. స్లాట్ విధానాన్ని తీసేయాలని, స్లాట్ లభించకపోయిన సదరు పేషెంట్‌కు వైద్య సేవలందించాలని, ఎంఒయును పాతపద్ధతిలో కొనసాగించాలని, ఇఎన్‌టి, ఐ, ఆస్తమాలజీ, డెంటల్, సర్జన్, తదితర వైద్యుల నియామకాలు తక్షణమే చేయాలని, స్కానింగ్ విషయంలో రోగులు కోరే ఆస్పత్రికి రిఫర్ చేయాలని, పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ముఖ్యంగా వెల్లూరు సిఎంసి ఆసుపత్రిలో ప్రస్తుతం రిఫరల్ రోగులను చూడటం లేదని, అంతర్గత సమస్యలను పరిష్కరించి రోగులకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైద్యులు నవీన్, సారంగి, గిరిధర్, క్రాంతికుమార్, ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు గోపాలకృష్ణ, ఆకుల నూకరాజు, బీటీ.జగదీష్, జెర్రిపోతుల మోహన్‌కుమార్, కారు రమణ, కొవిరి అవతారం, బిఎంకె.నాయక్, జీవీ.సుబ్బయ్య, బి.వరహాలబాబు, ఎంఎస్ఆర్.ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

యుపిఎస్‌సి పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 28న జిల్లాలో జరగబోయే యుపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం యుపిఎస్‌సి పరీక్ష నిర్వహణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న జరుగనున్న యుపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్షకు విశాఖ జిల్లాలో మొత్తం 29 సెంటర్లలో 10,865 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. రెండు జోన్లలో జరుగుతున్న పరీక్షలకు భీమిలి, విశాఖపట్నం ఆర్‌డిఒలు జోనల్ అధికారులుగా ఉంటారన్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష జరిగే ఒక గంట ముందుగా మాత్రమే పరీక్షా కేంద్రం తెరవబడుతుందని, అనంతరం పరీక్ష ప్రారంభమయ్యే 10 నిమిషాలకు ముందు వరకు మాత్రమే అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోనికి ప్రవేశ అనుమతి ఉంటుందని అన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, డిజిటల్ పరికరాలు వంటివి అనుమతించబోమని అన్నారు. ప్రతి ఒక్కరినీ విధిగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి అనుమతించాలన్నారు. వెన్యూ సూపర్‌వైజర్లు పరీక్ష నిర్వహించే మూడు రోజుల ముందు అన్ని పరీక్షా కేంద్రాలనూ తనిఖీ చేసి ప్రతి ఒక్క పరీక్ష హాలులో గోడ గడియారం అమర్చాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అదనంగా రెండు రూములు సిద్ధం చేసి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకొనేలా సరిపోయే ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంచినీరు సదుపాయం ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను, విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని ఎపిఇపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, కలక్టరేట్ పరిపాలనాధికారి ఈశ్వరరావు, విద్యుత్, ఆర్‌టిసి, జివిఎంసి, పోలీస్, రెవెన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోర్టు కంటైనర్ లారీల అడ్డగింత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోర్టు నుంచి విసిటిపిల్ కంటైనర్ లారీలు వెళ్లకుండా చూడాలని డిమాండ్ చేస్తూ 39వ వార్డు కోట వీధి మదీనా దర్గా వద్ద ఆ ప్రాంతం ప్రజలు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కంటైనర్ లారీల రాకపోకలు వల్ల గాలి, శబ్ద కాలుష్యం అధికంగా ఉంటోందని మండిపడ్డారు. అధిక లోడుతో ఇవి నడుస్తున్నందున జివిఎంసికి చెందిన రోడ్లు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. అలాగే కంటైనర్ లారీలను నడవకుండా చూడాలని 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ డిమాండ్ చేశారు. కొంతకాలంగా తాము ఇదే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా పోర్టు అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

చెత్తపోగు నిల్వలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వార్డులో చెత్తపోగు నిల్వలు లేకుండా యుద్ధ ప్రాతిపదికన డంపింగ్ యార్డుకు తరలించాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ జోనల్ కమిషనర్లను ఆదేశించారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మూడో జోన్ పరిధిలోని హెచ్‌బి.కాలనీ, పి అండ్ టి కాలనీ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో డంపర్ బిన్లు చుట్టూ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని వాటిని వెంటనే తొలగించాలని, డంపర్ బిన్ల చుట్టూ చెత్త వేయకుండా చూడాలని ఆదేశించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ జరుగుతున్నప్పుడు బిన్లలోకి చెత్త ఏ విధంగా వస్తోందని ఆరా తీశారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ కెవిఎన్ రవి, కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు పాల్గొన్నారు.

హయగ్రీవ ఇన్‌ఫ్రాపై ఐటి దాడులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖలోని హయగ్రీవ ఇన్ఫ్రాటెక్ కంపెనీలో బుధవారం రాత్రి ఐటి సోదాలు జరిగాయి. ఆదాయపు పన్ను శాఖ విశాఖలోని హయగ్రీవా అధినేత జగదీశ్వరుడి నిధుల వ్యవహారంపై ఇటీవల హైదరాబాద్‌లో నవయుగ కంపెనీలో ఐటి సోదలానంతరం దొరికిన లింక్‌తో దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఎంవిపి.కాలనీలోని కార్యాలయంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. 2019 ఎన్నికల్లో జరిగిన 100 కోట్ల ఆర్థిక లావాదేవీలు, వాటికి సంబంధించిన కేసులో సోదాలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. ఎ

రిజిస్ట్రేషన్లపై యూజర్ ఛార్జీల ఎఫెక్ట్ !

భూ రీ సర్వే కూడా కారణం

విశాఖ జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్‌ల ద్వారా మూడేళ్లలో లావాదేవీలు 2,15,512

- విలువ : 2529.42 కోట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంలో గడిచిన మూడేళ్లలో కాస్త హెచ్చుతగ్గులున్నా ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న యూజర్ ఛార్జీల ప్రభావంతో రిజిస్ట్రేషన్లు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం ఒక రిజిస్ట్రేషన్‌కు యూజర్ ఛార్జీ రూ.200 వసూలు చేస్తుండగా దీన్ని రూ.500కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేగాకుండా 10 పేజీల వరకే ఈ రూ.500 విధానం అమలుకానుంది. తర్వాత ప్రతి పేజీకి అదనంగా రూ.10 చొప్పున యూజర్ ఛార్జీ పడనుంది. దీంతో రిజిస్ట్రేషన్లపై నెగెటివ్ ప్రభావం పడుతుందని ఆ శాఖతో సంబంధం ఉన్న నిపుణులు చెబుతున్నారు.

9 ఎస్ఆర్‌ల ద్వారా రిజిస్ట్రేషన్లు

విశాఖ జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా గడిచిన మూడేళ్ల వరకూ మొత్తం 2 లక్షలా 15 వేలా 512 డాక్యుమెంట్లు రిజిస్టర్ జరగ్గా వచ్చిన ఆదాయం రూ.2529.42 కోట్లుగా ఉంది. మొత్తంగా చూసినప్పుడు 2020-21 సంవత్సరంలో కొంతమేరకు 'రాజధాని' ప్రభావం ప్రస్ఫుటంగా కనిపించింది. ఆ సంవత్సరం తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా 62,528 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరగ్గా రూ.718.42 కోట్ల రెవెన్యూ వచ్చింది.

ప్రభుత్వ భూమి విలువ పెరిగిందా ?

విశాఖ జిల్లాలో ముఖ్యంగా నగరంలో ఎక్కడా ప్రభుత్వ భూమి విలువ మాత్రం పెరగలేదన్నది స్పష్టంగా తెలుస్తోంది. ప్రైవేట్ భూమికి రియల్టర్ల ప్రభావంతో మాత్రం రెండింతలు మూడింతలుగా కాళ్లు వచ్చాయి. అయితే గడిచిన ఏడాది కాలంగా రియల్ ఎస్టేట్ ఊపు కూడా తగ్గిందని రియల్ ఎస్టేట్ యజమానులు చెబుతున్నారు. ఇళ్ల స్థలాలు, అలాగే ఇల్లు (ఫ్లాట్)లకు సంబంధించిన వ్యాపార లావాదేవీలన్నీ అంత సజావుగా సాగకపోవడంతో ఎంవివి.సత్యనారాయణ లాంటి పేరు గాంచిన రియల్ ఎస్టేట్ అధిపతి కూడా ఎంవివి ఫ్లాట్ల సేల్ అంటూ బోర్డులు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

యూజర్ ఛార్జీలతో పాటు భూముల రీసర్వే కూడా..

వాస్తవానికి గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే ప్రారంభించడంతో పక్కాగా లేని డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేసినట్లు భోగట్టా. కొత్తగా భూ సర్వే కోసం తయారు చేసిన నిబంధనలు కూడా రిజిస్ట్రేషన్లకు ఆటంకంగా మారాయని తెలుస్తోంది. ఏదేమైనా గతంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో రాజధాని అంటూ అందుకున్న నినాదంతో విశాఖలో భూ లావాదేవీలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. తాజాగా ఆ స్థితి లేదు. దీంతో రిజిస్ట్రేషన్లపైనా 2023 - 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎయులో ఉన్నత విద్యాశాఖాధికారి ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రశంసనీయమని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జె.శ్యామలరావు అన్నారు. బుధవారం ఉదయం ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ క్యాంపస్‌లో చేరిన ప్రతి విద్యార్థికీ ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అందించే విధంగా అన్ని కోర్సుల్లో మార్పులు చేసి అందిస్తున్న విధానం బాగుందన్నారు. దీని ఫలితంగా 3600 ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. ఇంజినీరింగ్ కళాశాలతో పాటు ఆర్ట్స్, సైన్స్ కళాశాలల విద్యార్థులకు సైతం మెరుగైన ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్లు, స్టార్టప్ కల్చర్‌ను అభివృద్ధి చేస్తున్నారన్నారు. వందకుపైగా స్టార్టప్‌లు వర్సిటీ క్యాంపస్‌లో పనిచేయడం మంచి పరిణామమన్నారు. ఇతర విద్యార్థులు దీని నుంచి స్ఫూర్తిని పొంది, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారడానికి అవకాశం ఉంటుందన్నారు. నాడు - నేడు స్ఫూర్తితో వర్సిటీ భవనాలను పూర్తిస్థాయిలో మరమ్మతులు, ఆధునికీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను శ్యామలరావుకు వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అధికారులు, డీన్‌లు పాల్గొన్నారు.

ఎయులో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న శ్యామలరావు

వాతావరణ ప్రభావం విశాఖపై అధికం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంటుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శనివారం ఆమె నోవోటెల్‌లో వాతావరణం మార్పుపై జరిగిన వర్క్‌షాపులో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగరంపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంటోందని, ముఖ్యంగా విశాఖతీర ప్రాంతంతో పాటు పారిశ్రామిక నగరం అవడం వల్ల వాతావరణంలో మార్పులు ఉంటాయని తెలిపారు. విశాఖ నగరంలో వాతావరణం మార్పు కోసం అనేక ప్రాజెక్టులు చేపడుతున్నామని, అందులో భాగంగా సోలార్ ఎనర్జీ, ఎల్ఇడి స్ట్రీట్ లైట్, విద్యుత్ వాహనాలు, నీటి ప్రాజెక్టుల వినియోగం ద్వారా గాలిలో కార్బన్‌డయాక్సైడ్‌ను తగ్గించుకోగలిగామని తెలిపారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న వారితో విశాఖ కలెక్టర్ మల్లికార్జున

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రశంసించారు. బుధవారం ఉదయం మహారాణిపేటలోని రెడ్‌క్రాస్ భవనంలో ఉన్న సమావేశ మందిరంలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ హోదాలో ఆయన హాజరయ్యారు. తొలుత సంస్థ స్థాపకులు హెన్రీ డునాన్ట్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్ క్రాస్ సంస్థ వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజలను ఉచిత వైద్య సేవలు, రక్తదానం ద్వారా ఎంతగానో ఆదుకుంటోందన్నారు. గత మూడు సంవత్సరాలలో రెడ్‌క్రాస్ సొసైటీ వారు అందించిన సేవలను, ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి సమయంలో నిర్వహించిన ప్రత్యేక బహుళ ప్రయోజన ఆరోగ్య శిబిరాలను గవర్నర్ అభినందించారని, అందుకుగాను ఆయన చేతులమీదుగా విశాఖ జిల్లా తరపున అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్త మార్పిడి చేసి మందులతో పాటు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నామని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శివ నాగేంద్ర రెడ్డి మాట్లాడుతూ సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్న కలెక్టర్ మల్లికార్జునను అభినందించారు.

నేడు రాజేంద్రపాలెంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం సచివాలయం పరిధిలో ఈ నెల 18న గురువారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి బడుగు రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి పాల్గొంటారని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని జలతరంగిణి జలపాతం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అడ్డతీగల గ్రామానికి చెందిన కె.నాగేశ్వరరావు ద్విచక్ర వాహనంపై చింతూరు వెళ్లి బుధవారం తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. మండలంలోని జలతరంగిణి జలపాతం సమీపం వద్ద నాగేశ్వరరావు బైక్ అదుపు తప్పి పడిపోవడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అటువైపుగా వస్తున్న మరో వాహనంలో నాగేశ్వరరావును రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విశాఖపట్నం - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మహబూబ్‌నగర్ స్టేషన్ వరకు పొడిగించాలని నిర్ణయించింది. ఈ మేరకు 12861 విశాఖపట్నం-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు మే 20 నుండి మహబూబ్‌నగర్ వరకు పొడిగించబడుతుంది, విశాఖపట్నం నుంచి సాయంత్రం 18.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06:45 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది 06:55 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి ఉదయం 09.20 గంటలకు మహబూబ్ నగర్ చేరుకుంటుంది. తిరుగు దిశలో రైలు నెంబరు 12862 మహబూబ్‌నగర్-కాచిగూడ -విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ మే 20 నుంచి మహబూబ్‌నగర్ నుంచి సాయంత్రం 16.10 గంటలకు బయలుదేరి 18.10 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. అక్కడి నుండి 18.20 గంటలకు బయలుదేరి ఉదయం 06.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.